# మ మ త

"సైకిలుకి లైటు లేదు! సైకిలాపు! ఏయ్! నిన్నే! నిన్నే"అని పోలీసు అరుస్తూ వెంటపడి పరుగెత్తుతూవస్తూన్నా లెక్క-చేయక దూసుకుపోయాడు చలపతి. అంత అర్జంటు పనేమిటో! చేతిలో టార్చివున్నా క్షణంసేపు సైకిలు దిగి పోలీసుతో "నమ్రమనివేదన" చెప్పుకోటానికి అతను గౌరవ నీయుడు! సంఘం దృష్టిలో పరపతి కలిగిన పెద్దమనిషి! రాత్రి ఏడు ఎనిమిది ప్రాంతాల అర్జంటుగా రివ్వుమని వెళ్ళుతున్న ఆ పెద్దమనిషికి గమ్యస్థానం నాలుగురోడ్లు కలిసే చోట, మునిసిపాలిటీ కుళాయి కెదురుగా రావిచెట్టు క్రింద అని ఆ పోలీసు కేం తెలుసు?

రోడ్డు ప్రక్క గా వున్న మ్యునిసిపాలిటీ లైట్లు వెన్నెల రోజులవటంనించి వేయలేదు. దట్టమైన రావి ఆకుల నుండి నెమ్మదిగా జాలువారుతున్న వెన్నెల, వెలిసిపోయిన పాత చీరకుమల్లె వున్నది.

అరగంట-గంట-గడిచిపోయింది. ఎవ్వరూ అతని వునికిని గమనించినట్లే లేదు! అతను ఎవరి కోసరం వేచి యున్నాడో వారు వచ్చేజాడ జవాబులేదు. ఎదురుగాప్రహరీ

గోడ పడిపోయివున్న పాత పెంకుటిల్లు వుంది. దానిలో నాలుగయిదు మధ్యతరగతి కుటుంబాలు కాపరం చేస్తున్నాయ్. చలపతి మాటిమాటికీ అటు వెంపు చూస్తున్నాడు. చేతిలోని టార్చిలైటు తీసి, నూతి కానుకునివున్న జామిచెట్టు మీదకు వేస్తున్నాడు క్రమంగా తొమ్మిదయింది; జనం వస్తూ పోతూవున్నారు. ఒక కుర్రాడు దాహం వేసిందేమో కుళాయినొక్కి నీరు రాకపోవటంనించి "వేస్—పేహేస్" అని అరుచుకుంటూ పోయాడు. కులపతి వులిక్కి పడ్డాడు. ఇంతలో నూతివద్ద నీడ కదిలింది, చలపతి కళ్ళల్లో కరుణ కరగింది. ఒక్క వుదుటున నూతివద్దకు పోబోయాడు. సైకిలుకి స్టాండు వేయలేదేమో దబ్బుమని క్రిందపడింది. చిరాకుగా సైకిలుని చెట్టుకి జారవేసి దగ్గరకు వచ్చాడు.

"నా మీద చిరాకు ఆసైకిలుమీద చూపుతున్నావా చలం?" పరిహాసంగా అన్నది పరిహాసంగా ఆ గొంతు.

"నీమీద చిరాకుదేనికి మైథిలీ? చిరాకే వుంటే నిరంతరం నీ కోసరం ఈ బాధ దేనికి? నా ప్రార్థన ఆలకించటానికి నీ కిన్ని రోజులు పట్టిం° ?" అన్నాడు చలం ఆత్మలోని కరుణని గొంతులోకి మార్చుకుని.

"నీ ప్రార్థన ఇప్పుడూ వినలేను చలం! అప్పుడు నమ్మలేక పోయాను. ఇప్పుడు ధర్మం ఒప్పుకోదు" అన్నది మైథిలి... ...

నిజానికి మైథిలి కేం వచ్చిందిప్పుడు? లోకం దృష్టిలో మైథిలంత అదృష్టవంతురాలు లేనేలేదు! అత్తగారి ఆదర

ణకు లోటులేదు! భర్త ప్రేమాభిమానములకు తక్కువ లేదు! సహజంగా ఆడదాని క్కావల్సిన శుభలక్షణాలన్నిగల మైథిలికీ నిరంతర మథన దేనికి? దేని కోసరం?

అయినా చలపతికీ మమకారం ఎప్పుడు కలిగింది? ఎలా కలిగింది? ప్రేమించుకోటానికి ఆరాధించటానికి నలుగురు పిల్లల తల్లి, పోషిత భర్తృక అయిన మైథిలే దొరికిందా! ఆహా, ఏమి విలక్షణమైన జగత్తు!

ఒక సాయంత్రం చల్లనిగాలిలో డాబామీద చేతులు వెనక్కి విరచి కట్టుకొని అటూ ఇటూ షికారుగా తిరిగే చ పతికి నూతిదగ్గర పిల్లల బట్టలు వుతుకుతూన్న సంసార స్త్రీని పరికించి చూడాల్సిన అవసరం ఏం కలిగింది? భార్య చనిపోతే పోవచ్చు. సలక్షణంగా మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చు, అంతేకాని చేజారిన ప్రేమధనము మళ్ళీ చేతుల్లోకి తీసుకురావాలన్న ఆకాంక్ష దేనికి? అతనిలోని ఆరిపోనిఆశాజ్యోతి లాంటిదేదో ఆ స్త్రీని పరికించి చూడాల్సిన అవసరం కలిగించింది. వెంటనే కాళ్లు దడదడ లాడాయ్. ఆకాశం వెంపు కృతజ్ఞతా పూర్వకంగా చేతులు జోడించి మనఃపూర్వకంగా సర్వసాక్షికి నమస్కరించాడు.

డాబా నుంచి చూస్తే దగ్గరగా కన్పించిన దృశ్యము నాలుగు అడ్డరోడ్లు దాటి తిరిగాక కాని తటస్థ పడలేదు. తీరా దగ్గర కొచ్చాక చిన్ననాటి స్నేహితుడు కేశవరావు కన్పించాడు. "ఏరోయ్? ఇదేనేంటి రావటం? లోపలికిరా! మా పిల్లల్ని చూచిపోదువు కాని! నీ కెంతమంది? నీ కెంత

మందయినా ఫరవాలే. పిల్ల జమిందారువు!” అన్నాడు కేశవ. అన్నిటికి చిరునవ్వు నవ్వుతో మౌనమే సమాధాన ముగా వూరుకున్నాడు చలపతి.

“నీ పిల్లలేరీ? మీ అమ్మగారు కులాసాగా వున్నారా?” అన్నాడు చలం.

“వస్తారు! ఇప్పుడే అలా ప్లేగ్రౌండు వేపు పోయి వుంటారు. ఒక్కక్షణం కాలు నిలువదు వెధవాయిలకు. బామ్మకూడ వాళ్ళల్లాగే ఏ దేవాలయానికో వెళ్తుంటూంది. వుండు. మా శ్రీమతిని పరిచయం చేస్తాను. నా పెళ్ళికి రాలేదు కదూ? నువ్వు? మీ వూరే! ఏమేవ్! ఓసారి ఇల్లారా!” అన్నాడు కేశవ.

వెలిసిపోయిన కలనేత చీర చెంగుతో చేయి తుడుచు కుంటూ ఈవలికి వచ్చింది మైథిల తలెత్తి చూచాడు చలం తన లావణ్యరాశి జీవనజ్యోతి అనుకున్న మైథిలి! తను ప్రాణంలో ప్రాణంగా ఆత్మలో ఆత్మగా భావించిన తన మైథిలి! ఇంకా ఇంకా అవే తలపోతలతో శేష జీవితం గడుపుదా మనుకున్న తన కలల నాయకురాలు! సాధారణ గృహిణిలా అయిపోయిన మైథిలి వెంపు ఆతృతగాచూచాడు! ఆ చూపులో యుగ యుగాలుగా చేతులు చాస్తూ పిలుస్తూ వున్న, అలసిపోయి పరిగెత్తలేని ఒక అమాయిక పాంథుని ప్రకృతి కనుపిస్తుంది.

“ఇంక మన కష్టాలు గట్టెక్కాయిలే మైథిలీ! వాడు మన వూళ్ళో వున్నాడంటే మనం ఇంకెవ్వరిముందు చేయి

జాపక్కరలేదు. మేము చదివే రోజుల్లో మాకందరికీ హాస్టలు బిల్లు లెక్కలేకుండా చెల్లించేసేవాడు. క్లాసులో అన్నింటిలో ఫస్టే! ఏంరా, అంబుజం జ్ఞాపకం వుందా? సన్నగా తెల్లగా చీపురు పుల్లలా వుండేది! దాన్ని ఆరాధించే వాళ్ళల్లో నువ్వుకూడా వున్నావుగా! అదిప్పుడు ఈ వూళ్ళోనే వుంది. ఏం! కలుద్దామని వుందేమిటి! మీ ఆవిడ పర్మిషన్ పుచ్చుకుంటేగాని దానిల్లు చూపెట్టను!" అని చిన్ననాటి నేస్తాన్ని చూసిన మైమరపుతో చెప్పుకపోతున్నాడు కేశవ. కాని ఆ రెండు హృదయాలలో ఏదో చెప్పలేక. విధి బలీయమైన పోగా దాటులేని అగాధాలలో పడివున్న మూగ ప్రకృతి మేల్కొంది... ...

చిన్నప్పుడు మాసిపోయిన గౌనుతో తోటిపిల్లలతో ఇసుకలో పడుతూ లేస్తూ 'దూదంపుల్ల' ఆటలాడే మైథిలిలో ఏనాడు చలం ఆటలాడ లేదు.

పొట్టి పరికిణి—జడలో సిల్కు గుడ్డముక్క రిబ్బనూ—సగం విరిగిపోయిన పలక – అన్నయ్య లవి చిరిగిపోయిన పెద్ద పెద్ద ఇంగ్లీషు బుక్కులు పట్టుకుని బళ్ళోకి వెళ్ళే మైథిలిని చూసి ఏనాడూ జాలి పడలేదు చలం.

క్రొత్త వాయిల్ వోణీ వేసుకుని – చేతికి అందక వుంగరాలు తిరిగే జుట్టుకి పట్టుసవరం అతుకుపెట్టి, పెద్ద వాల్జడ వేసుకుని, తలనిండా ముద్ద బంతిపూల చెండు పెట్టుకుని. బిందె చంక నెట్టుకుని అడుగులు లెక్కపెడ్తున్నట్లుగా చెరువుకు వెళ్ళే మైథిలిని చూసి ఏనాడూ మైమరవలేదు చలం.

నిత్యం "పెద్దింటి" వారింటికి వస్తూపోతూవుండే మైథిలి చలంకోసం తహతహ లాడటంగానీ కళ్ళు త్రిప్పు కుంటూ మాట్లాడటంకాని చేసేది కాదు. చలం వదినగార్లు, తల్లీ మైథిలిని కూర్చోబెట్టుకుని ఆ కబురూ ఈ కబురూ చెప్తుండేవారు ఎప్పుడయినా ఏ మంచినీళ్ళకో చలం లోనికి వెళ్తే మైథిలి లేచి నుంచునేది. "ఫరవాలే! కూర్చో నేనా ట్రే సేపు వుండను ఇక్కడ !" అనేవాడు చలం. తల్లీ వదినలు నవ్వేవాళ్ళు. మైథిలి సిగ్గుపడుతూ కళ్ళు క్రిందకు వాల్చే సేది.

ఆఖరు పిల్లవానిపెళ్ళి మరికాస్త ఘనంగా చేయాలను కున్నారు చలం తల్లీవాళ్ళు. చలం పట్నంలో చదివేవాడు. క్లాసులో తెగగోల చేసేవాడు. ధనవంతుల అబ్బాయ్ అల్లరి అందరికీ ఇష్టంగానే వుండేది మరి! కాలేజీ వదలగానే గళ్ళ రుమాళ్ళు మెడకి అడ్డంగా కట్టుకుని కిళ్ళీలు నములుతో సైకిళ్ళమీద ఆడపిల్లల వెనకే బయలుదేరేవాళ్ళు, చలం ముఠా. అందరికన్న అంబుజం చలాన్ని బాగా ఆకర్షించింది. క్రమంగా అంబుజం కోసరం హాస్టలు ముందర పడిగాపులు పడటం అలవాటయింది! లెక్కలేనంత డబ్బు ఖర్చుచేసి చీరలూ టాయిలెట్ సెట్సుకొని ప్రజెంట్ చేసేవాడు. అంబుజం సన్నగా పొడుగ్గా తెల్లగా వుండేది. తెలుగువాళ్లు కారు – తమిళులో, మళయాళీలో తెలియదు.

"నా హృదయం నీ కర్పిస్తున్నాను అంబూ! నీవు నిరాకరిస్తే చచ్చిపోతాను నాకు లెక్కలేనంతధనం వుంది.

నిన్ను గులాబీలా చూసుకుంటాను. నువ్వు కాలు కదపక్కర లేదు. మా ఇంట్లో దాస దాసీజనానికి లోటులేదు" అని ఏమేమో ప్రేమ సంభాషణలు, దేవీపీఠము ముందర పూజారి వలె మాట్లాడేవాడు. అంబుజం నవ్వి వూరుకునేది ఆమె కళ్లు పరిహాసంగా కొంటెగా మెరిసేవి! బి. ఎ. పాసవ్వగానే ఓ ఇంగ్లీషు లెక్చరర్ని రిజిస్టర్డ్ మారేజ్ చేసుకుని, చలం ప్రేమకు గుడ్ బై చెప్పింది.

చలం వెర్రివాడులా అయిపోయాడు ఎంత ద్రోహం చేసింది అంబుజం! తను సెలవలకు వూరికూడా పోకుండా వుండిపోయాడు! ఛీ. ఈ ఆడజాతే అంత - అనుకున్నాడు. తనలో లేనిది ఏం చూసిందని అతన్ని ప్రేమించింది! ధనానికా? ఆ రెండువందలయాభయితప్ప చిల్లిగవ్వకూడారాదు. అందానికా ? తనకంటే ఓ ఛాయ తక్కువకూడాను ! తన అందానికి ధనానికి విలువనివ్వని అంబుజం అంటే ఒకవిధమైన కోపం కలిగింది. ఆఖరుసారి విడిపోయేటప్పుడు అంబుజాన్ని సమాధానం కోరాడు చలం.

"చూడు చలం! నీకు నిలకడలేదు! నిన్నెలా ప్రేమిస్తానుచెప్పు! పైగా నీ అంతస్థుకు నేను తగను! నేను నిన్ను ఇంతకాలం ఒక స్నేహితుడిలాగానే భావించాను కాని వేరు కాదు. ఆయనతో సంగతి అంతా చెప్పాను. 'తోటి మనిషిని గౌరవించటానికి ప్రయత్నిస్తాను. ఆపైన నీ ఇష్టం!' అన్నారు. ఆయన నిరాడంబరతకు నేను వశనయ్యాను. ఆడది

అందచందాలకు, ధనానికి ప్రలోభపడుతుందని అనుకోకు. కావలిస్తే ప్రయత్నించి చూడు" అన్నది అంబుజం.

ఇంటికి వచ్చేసరికి పెళ్ళిప్రయత్నాలలో వున్నారు పెద్ద వాళ్ళు. "అప్పుడే ఏమిటమ్మా!" అన్నాడు చిరాకుగా చలం.

"ఈ చదువుకునే కుర్రాళ్ళ మాటలే అంత! ఇళ్ళల్లో లక్షణంగా పెళ్ళిళ్ళు చేస్తామంటే నసగటమూనూ-పట్నాలు వెళ్ళి వెర్రివెర్రి వేషాలు వేయటమూనూ" అన్నది పెద్ద వదినగారు.

చలం తల్లి తర్వాత పెత్తనమంతా ఆవిడదే! ఆవిడ కాపురానికొచ్చినప్పుడు చలం ఆరేళ్ళ పసివాడు.

ఆ సాయంత్రం అలవాటుగా షికారెళ్ళాడు చలం. మనస్సు సరిగ్గాలేదు. రాబోయే భార్యని గురించి వూహాగానాలు, చేజారిన అంబుజం గురించిన దురభిప్రాయాలతో కలతబారిన తలపులతో వచ్చినదారినే వస్తూ, పోయినదారినే పోతూ నడుచుకుంటున్నాడు. జ్యేష్ఠమాసం. వుండుండి పడమటదిక్కుగా ఓ మబ్బుపట్టి సన్నగా గాలివాన ప్రారంభమయ్యింది. వర్షంవస్తుందేమో అని కంగారు పడుతూ పెద్ద పెద్ద అంగలువేస్తూ వస్తున్న చలపతికి చెరువు మెట్టమీద ఎవరో కూర్చున్నట్లు అగపడింది. దగ్గరగావచ్చి "ఎవరది?" అన్నాడు. లేచి నించుంది మైథిలి. ఎక్కిళ్ళుకూడా వస్తున్నాయ్.

"నువ్వా మైథిలీ? ఇక్కడ కూర్చున్నావేం తీరికగా! ఇంట్లో పను లెగ్గొట్టొచ్చునా?" అన్నాడు పరిహాసంగా.

"కాదు చలం. బిందె చెర్లోకి పోయింది. ముంచుతూ అటు పురుముతూంటే చూస్తూవుంటే చేజారిపోయింది. ఎట్లా!" అంది.

"అంత పరధ్యానంగా ఎలా వున్నావ్! కాబోయే భర్తని గురించి ఆలోచిస్తున్నావా!" అన్నాడు చలం.

ఎంతమాట! పద్దెనిమిదేళ్ళ ఆడపిల్ల చెరువు దగ్గర వొంటరిగావున్న సమయాన్ని రానున్న విపత్తును గురించి దుఃఖిస్తున్న ఆడపిల్ల దగ్గర అనవలసినమాటేనా అది? అలాంటి మాటలు చలానికి సహజంగానే వస్తయ్! కాని మైథిలి ఎప్పుడూ విని ఎరుగదు. సిగ్గుతో జల జల్లాడింది. ఆమె ముఖం వర్షం రాబోయే ముందరి ఆకాశాన్ని తలపింప జేసింది. చలం హృదయం జాలితో కరుణతో నిండింది. భుజంమీద చేయివేసి "ఫరవాలే! నే తీసిస్తానులే!" అన్నాడు తేలికగా. ఆ స్పర్శతో మైథిలి నిలువెల్లా వణకింది. "ఏం పని చలం?" అనేనా అనలేకపోయింది. చలాన్ని ఆకాశం అంత ఎత్తుగా వూహించుకుంది. ఏడుకొండలవాడి గోపురం మీది బంగారుగుళ్ళ చేత్తో పట్టుకున్నంత సంబరపడింది. తను అనుకుంటున్నదేమిటో తనకే తెలియని వివశంలో పడి పోయింది. "ప్చ! మామూలు ప్రేమకథే!" అనుకుంటారు ఎవళ్ళయినా. కాని ఎందుకవుతుంది? అంత ఆరాధనలో పడ్డ మైథిలి వారంరోజులు గడిచేటప్పటికి చలంతో మాట్లాడిన వైనం గమనిస్తే, ఎవరూ అనుకోరు.

"పొరపాటు చలం! నన్ను క్షమించు! నేను నీతో

రాలేను! నువ్వు మామూలుగా పెళ్ళి చేసేసుకో! నీ బంగారువలలో పడబోయిన నన్ను నేను రక్షించుకోవటానికి ఇన్నిరోజులు పట్టింది! జరిగినదంతా ఒక కలగా భావిద్దాం ఇద్దరమూనూ. నా నూరేళ్ళజీవితం అపహాస్యము పాలు గావటం నా కిష్టంగా లేదు." అన్న మైధిలిని చూస్తే చలానికి కోపం రాలేదు. పైగా నవ్వు వచ్చింది.

వారంరోజుల్లో ప్రేమతత్వమంతా బోధపడిన దానికి మల్లె, విరాగిణికి మల్లె మాట్లాడుతున్న మైధిలిని చూస్తే ఎవరికి నవ్వురాదు? బిందె చెరువులోనికి జారుకుపోతే చేతులు ముడుచుకూర్చున్న మైధిలేనా జరిగిందంతా మరచిపొమ్మంటూంది! ఛెళ్ళున వీపుమీద కొరడాతో కొట్టినట్లుగా అంబుజం మాటలు జ్ఞాపకం వచ్చినాయ్. అంబుజం తనకు నిలకడ లేదంది. మరి మైధిలి! ఒక ఆడది అన్నమాటకు రెండో ఆడదానిముందయినా తనని తను నిలబెట్టుకోవాలి.

"మైధిలీ! నాకున్న సంపదంతా నీకు తెల్సును! నాకు పెళ్ళి కాకపోదనీ తెల్సును! అయినా నీముందు నేను ఇంతగా ప్రాధేయపడుతున్నానంటే నీమీది మమతవల్ల నే నని అనుకో! నన్ను నమ్మ! మనస్ఫూర్తిగా నమ్మ! నీకు నేను చెరుపు చేయను. చేయలేను" అన్న చలం మాటలు మైధిలి నమ్మలేకపోయింది. ధనవంతులయిన మగవార్ని నమ్మరాదని మైధిలి కెలా తట్టిందో మరి! నిజానికి తట్టాలిసిన వయసు కాదది!

మళ్లీ ఓసారి దెబ్బతిన్నాననుకున్న చలం నిర్లక్ష్యంగా

పెళ్ళికి వొప్పుకున్నాడు. ఆ హడావుడిలో కేశవరావు శుభ లేఖను అతను పట్టించుకోనేలేదు. ఒక నూటపదహార్లు బహుమానంగా పంపించేసి వూరుకున్నాడు. 20 వేల రూపాయలు కట్నంతో వొంటినిండా రవ్వల నగలతో అత్తింటికొచ్చిన రాజం. చలాన్ని ఏమాత్రం ఆకర్షించలేకపోయింది. అది ఆవిడ తప్పే అనాలి. ఇంట్లో దాసీలమీద అధికారం చలాయిస్తూ సభల్లోనూ సమావేశాల్లోనూ భేషజాన్ని ప్రదర్శిస్తూ పదేళ్లు గడిపి ఆవిడ చనిపోయింది.

ఈ పదేళ్ళూ రాళ్ళల్లా గడిచాయ్. చలపతి రాజం మీద ద్వేషముకాని, ఏవగింపుకాని చూపెట్టేవాడు కాదు. ఆవిడయినా "ఏమిటది? మీ మనస్సులో ఏదోవుందిలా వుంది! నాతో చెప్పకూడదా!" అని అడిగి అతనిహృదయానికి దగ్గరగా అవటానికి ఆకాంక్ష చూపెట్టేదికాదు. డబ్బు విరివిగా ఖర్చుచేసేవాళ్ళు ఇద్దరూను. ఆవిడ ఎప్పుడూ తోటి ఆడవాళ్లలో తనకు గల డబ్బూ, భర్తకు గల హోదా తప్ప ఇంకేమీ పట్టించుకునేది కాదు! చలపతికి ఎప్పుడూ మైథిలిస్మరణే సరిపోయేది.

మైథిలి ఏంచేస్తూ వుంటుంది! తండ్రి తనకన్నా గొప్ప సంబంధం తేగలడన్నది కలలో వార్త! మైథిలికి 'చలం మాట వినివుంటే!' అన్న వూహ రాకపోతుందా! మైథిలికెప్పుడయినా ఆ వూహవస్తేచాలు; కనీసం ఆ వూహా వున్నదని తనకు తెలిస్తే చాలు. వెంటనే రెక్కలుకట్టుకుని మైథి

లిని తనవద్దకు తెచ్చేసుకుంటాడు. ఏమిటి ఈ మమకారము! తాళికట్టిన రాజం ఏమంటుంది! ఆమె "ఇదేమిటి!" అని అడిగితే తను చెప్పాల్సిన సమాధానం ఏది?—అని ఆలోచించేవాడు కాడు. ఆఫీసునుంచి రాగానే ఈజీఛైర్‌లో కూర్చొని కళ్ళుమూసుకుని మైథిలితో వూహాకాశములో విహరించేవాడు. ట్రాన్సఫర్ వుద్యోగా లవటంనించి వూరూరూ తిరగాల్సి వచ్చేది. ట్రాన్సఫర్ అయినప్పుడల్లా ఈ వూర్లో మైథిలి వుంటుంది. తన్ను చూడగానే "చాలా కష్టపడుతున్నాను చలం! బాధలు భరించలేకపోతున్నాను. నీవద్దకు వచ్చేద్దామనుకుంటున్నాను!" అని దుఃఖిస్తుందని అనుకునేవాడు. మైథిలిని నిజంగా ప్రేమిస్తే ఆమెకు ఎప్పుడూ ఏదో కష్టము రావాలని, తన సహాయము కోరాలని ఎందుకనుకుంటాడు! తాను మైథిలికంటె అన్ని విషయములలోనూ అధికుణ్ణనే భావము అంతర్యంలో కీలమ్యేవాడేమో! రాజం చనిపోయాక అతను ఎప్పుడూ నిర్మమతతో మెలగడం చూస్తే తల్లి "రాజం కోసరం బెంగపెట్టుకున్నాడు. పదేళ్ళ సాహచర్యం మరి!" అనుకునేది. ఆవిడ చెప్పాల్సిన నీతులేవో చెప్పి మళ్ళీ పెళ్లి చేసుకొమ్మని వేధించేది. కేశవ భార్యగా మైథిలి పరిచయం అయినప్పుడు ముందు ఆందోళనచెందినా తర్వాత మనస్సు స్వాధీనపరచుకొన్నాడు కేశవ ఎప్పుడూ జిడ్డుగాడే! కేశవ తల్లికి పురాణాలు కాలక్షేపాలూ తప్ప రెండోగొడవ లేదు. కేశవ నాలుగో కొడుకు పుట్టినరోజున ముఖమల్ బట్టలు కొని ప్రజంట్ చేశాడు. కేశవ పొంగి

పోయాడు. మైథిలి ముఖం చిట్లించింది! కేశవ తల్లి "ఎందుకు నాయనా చంటాడుకే అంతంతలేసి ఖరీదుగల గుడ్డలు! నీ కివ్వాలని వుంటే డబ్బే ఇవ్వకపోయావా, నలుగురికి నాలుగుజతలు వచ్చును!" అన్నది చంటాడు అచ్చగా తల్లిలానే వుంటాడు. తెల్లగా, బొద్దుగా త్రుళ్ళుతూ వుంటాడు. చలానికి బాగా చనువయ్యాడు. రాంగానే చలం మీదికివచ్చేవాడు. "మైథిలీ! ఎప్పుడూ పనేనా నీకు? కాస్సేపు కూర్చుని కబుర్లాడకూడదూ?" అనేవాడు, మైథిలి వచ్చేది. ఒకొక్కప్పుడు ఏదో తెలియని ఆనందంతో వుత్సాహంతో నలుగురు పిల్లల తల్లిననేమాటకూడా మర్చిపోయి రివ్వుమని తన మనస్సులోని మమతలన్నీ పాటలుగా అతని చెవిలో పాడా లనిపించే మెదాకి.

"మైథిలీ! నిన్ను చూడకుండా ఒక్కక్షణం గడపలేను. లోకంతో మన కేమిపని! ఎవ్వరూ లేని దూరతీరాలకు పోదాం—చంటాడుని తీసుక వచ్చేయ్!" అనేవాడు. మైథిలి మాట్లాడేదికాదు.

"మైథిలీ! గత స్మృతులతో జీవితం అంతా నింపుకుని బ్రతగడం సులభసాధ్యం కాదు. ఇప్పుడయినా నన్ను నమ్ము! ఇక్కడ నీకేం సుఖంగా వుందని? కావల్సివస్తే నలుగురు పిల్లల్ని తీసుకవచ్చెయ్. వాళ్ళని కాన్వెంట్‌లో చదివిస్తాను. నీ కోసరం కేశవ బాల్యస్నేహితంకూడ వదలుకునేందుకు సిద్ధమవుతున్నానంటే ఇంకా నమ్మకం కుదరలేదా!" అనేవాడు.

ఒకరోజు మైథిలి దగ్గరకు వచ్చేవేళకు, లోపల తలుపులు వేసివున్నాయ్. కేశవ ఏదో గొడవ పెడ్తున్నట్లున్నాడు.

"నిజం చెప్పు! లోకం అంతా కోడై కూస్తూంది. పిల్లమీది సరదా అనుకున్నాను. కాని నీమీద సరదా అని నాకేం తెలుసు? చిన్ననాటి నేస్తంకదా అని చనువిస్తే ఇదా నువ్వు చేసేపని! ఛీ! పాడు..."

చలం వినలేక పోయాడు. మైథిలి ఏడుస్తూంది.

"నన్ను నమ్మండి! నిజం చెప్తున్నాను! మీ పాదాల తోడు! ఇంతవరకు నేనేం తప్పు చేయలేదు!"...

హుఁ! ఆనాడు తన్ను నమ్మిందా! నమ్మి తనతో వచ్చేయమని ఎంతగా బ్రతిమిలాడాడు? అయినా కేశవకు ఇలాంటి దురూహ ఎలా కలిగింది! నాలుగురోజులుగా అటు వెళ్ళటం మానుకున్నాడు కేశవ ఆఫీసుకువచ్చి కలుసుకున్నాడు. "చలం! రావటం మానేశావేం! మైథిలి ఏమన్నా అందా? సహృదయులైన స్నేహితులతో ఎలా మెలగాలో దానికి తెలవదు. ఒక పదిరూపాయలుంటే యివ్వు. చంటాడుకి జ్వరం తగిలింది. హార్లిక్స్ కొనుక్కోవాలి" అన్నాడు.

సాయంత్రం చలం మైథిలివద్దకు వెళ్ళేసరికి ఒక్కర్తె వున్నది. పిల్లలు ఎటో వెళ్ళారు. చంటాడు నిద్రపోతున్నాడు. అత్తగారు ఏదో కాలక్షేపానికి వెళ్ళినట్టుంది. సాదావాయిలు చీరతో తెల్లగా పొడుగాటి మెడ నంటిపెట్టుకున్న నల్ల పూసల తావళంతోవున్న మైథిలిని చూడగానే మళ్ళీ తన

లావణ్యరాసి జ్ఞాపకాని కొచ్చింది. మైథిలి చలాన్ని చూడ గానే బావురుమన్నది.

"నీతో వచ్చేస్తాను చలం! తప్పక వచ్చేస్తాను. నా కీ పిల్లలు వద్దు. సంపారం వద్దు! నీ ఇంటిలో దాసిదానిలా పడి వుండమన్నా వుంటాను నన్ను క్షమించు చలం! ఆఖరుకి చంటాడినికూడా తీసుకరాను" అని చలం భుజంమీాదికి వ్రాలిపోయి వల వలా ఏడ్చేసింది

ఆనాడు చెరువు దగ్గర బిందెకోసరం ఏడ్చినప్పుడు అవలీలగా చేతుల్లోకి తీసుకుని ఓదార్చిన చలానికి ఈనాడు ఆవిడను స్పృశించటానికి చేతులు రాలేదు.

ఇన్నాళ్ళు తను కలలుకన్న సమయం రానే వచ్చింది! తీరా స్వాధీన అయిన స్త్రీని లాలించటానికి అశక్తుడయ్యాడు చలం. "వూరుకో మైథిలీ! వూరుకో! ఎవరన్నాచూస్తే ఏమనుకుంటారు?" అనగలిగాడు.

"ఏమనుకుంటారు? అనుకుంటే అనుకోనీ! ఇన్నాళ్ళు ఆరాధించిన నా చలానివి నువ్వు యిలా ఎలా అనుకోగలి గావ్! కేశవ మాటలు పడలేకుండా వున్నాను. ఏ తప్పూ చేయని నన్ను దోషిక్రింద జమచేశారు. వారే తప్పుపని నాకు అంటగట్టారో, అదే నేను చేస్తే వారి కళ్ళు చల్లబడ తాయ్." అని ఆవేశంతో రెండు చేతులూ చలం భుజం మీాదవేసి ఏడ్చేసింది.......

ఇంటికివచ్చి ఈలపాట పాడుకుంటూ ఈజీచైరులో కూలబడ్డ కొడుకునిచూసి ఆ తల్లి దార్లోపడ్డాడని సంబర

పడింది. రెండు మూడు రోజులు స్థిమితం చూసుకుని ఆ చెరుకువాడవాళ్ళకి మాట ఇవ్వొచ్చును అనుకున్నది. ఆ అమ్మాయి చదువుకున్నదే అట! మనవాడి దుఃఖాన్ని క్షణంలో మాయంచేయగలదు అనుకున్నది. ఆవిడ తక్కిన పిల్లలందరు పిల్లలతో పాపలతో సుఖంగా వున్నారు. రాజం పోయినప్పటినుంచి వీడే ఇలా తయారయినాడు అని ఆవిడ కుమిలిపోతున్నది.

నిరంతరం మనోవ్యథతో మలినమవుతున్న మనస్సును ఎవరు రంజింప చేయగలరు? కాలమే మాన్పలేని గాయాలు మానవమాత్రులవల్ల మానుతాయా?

'ఇప్పుడు ధర్మము ఒప్పుకోదు' అన్న మైథిలి మాటలకు చలం ఆమె కళ్ళలోనికి చూశాడు. ఇన్నిరోజులుగా తాను వెదుకుతున్న ఆత్మశాంతి లాంటిదేదో ఆ కళ్ళనీడల్లో దొరకాలని ఆశించాడేమో!

మైథిలి మళ్ళీ అన్నది. "క్షమించు చలం! నేను వాళ్ళని వదిలి రాలేను. నిన్ను ఎప్పుడూ వ్యథపెట్టాను. మనస్ఫూర్తిగా క్షమించు!" అన్నది. "వాళ్ళని" అన్నప్పుడు ఏదో సిగ్గుతెర ఆవరించినా ముఖ్యంగా మాతృ వాత్సల్యమే కనిపించింది చలానికి. ఒక్కసారి ఆ కథంతా అంబుజంతో చెప్పాలి! ఇంకా తనని నిలకడ లేనివాన్క్రిందే జమచేస్తుందా! అరే! ఇదేమిటి! తన్ని ఇన్నాళ్ళూ మైథిలే మరపింప జేసింది అనుకున్నాడు. తన మనస్సులో ఇంకా అంబుజం స్మృతి మణగిపోలేదేం! కేవలం అంబుజం అన్నమాట వల్లనేనా

తను జితేంద్రియుడైనాడు. తను అంబుజాన్నా మైథిలినా ప్రేమిస్తా! తన ప్రేమే నిజమైతే వాళ్ళెల్లావుంటే సుఖంగా మనగలరో వాళ్ళని అలానే వుడ్నిస్తేసరి! నిజమైన ప్రేమికులు ప్రతిఫలం వాంఛింపరు. మరి తనకీ ప్రాకులాట దేనికి? కేవలం తన వ్యక్తిత్వపు గొప్పతనం వెల్లడికావటం కోసమేనా?

నిర్విచారంగా వెనక్కు మళ్ళాడు చలం. ఇన్ని రోజులు ఏదో తెలియకుండా ఎండమావుల వెంట పరుగెత్తినట్లు, ఇప్పుడు దాహం తీరినట్లు తృప్తిపడ్డాడు చలం.

"రేపు వస్తావుకదా చలం?" అన్నది మైథిలి.

"వస్తాలే! ఇక్కడ ఆట్టేసేపు నిలబడకు! కేశవచూస్తే ఏదయినా అనుకుంటాడు మళ్ళీ" అని నవ్వాడు చలం.

మైథిలీ నవ్వింది, నిండు చామంతిలా. చంద్రుడు ఆకాశం మధ్యకు ఎగబ్రాకాడు చలం సైకిలెక్కాడు. మైథిలి అక్కడ ఎంతసేపు నుంచుందో ఎవ్వరికీ తెలియదు.